సాక్షి విశాఖపట్నం

బుధవారం । 16 । జూలై । 2025



కూటమి నీ(చ)టి రాజకీయం 8లో



'రాష్ట్రంలో 12వ పే కమిషన్ ప్రకటించండి' 8లో

సీనియర్ల సారథ్యం.. యువోత్సాహం 8లో

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది



మహిళలకు రక్షణ కల్పించాలని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, మహిళా నేతలు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు
- కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడిని ఖండించిన నేతలు

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని.. చివరికి జిల్లా ప్రథమ మహిళకు కూడా రక్షణ కల్పించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు అన్నారు. కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్, బీసీ నాయకురాలు ఉప్పాల హారికపై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహానికి పార్టీ నేతలతో కలిసి ఆయన క్షీరాభిషేకం చేశారు. పార్టీ అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో కె.కె.రాజు మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను పక్కన పెట్టి, సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజలు గానీ, ప్రతిపక్ష నాయకులు గానీ హామీల గురించి ప్రశ్నిస్తే కూటమి నేతలు దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. తాజాగా బీసీ సామాజిక వర్గానికి చెందిన కృష్ణా జెడ్పీ చైర్‌పర్సన్ హారిక దంపతులపై టీడీపీ గూండాలు దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బీసీలను వెన్నుతట్టి ప్రోత్సహించారని, వారికి రాజ్యాధికారం పొందే అవకాశం కల్పించారని గుర్తు చేశారు. చంద్రబాబు బీసీలపై వివక్ష చూపిస్తూ.. వెనుకబడిన వర్గాల ప్రజలను అవమానిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి సంక్షేమ పథకాలు అమలు చేసే సమర్థత గానీ, రాష్ట్రాన్ని పాలించే హక్కు గానీ లేదన్నారు. కనీసం రాష్ట్రంలో మానవ హక్కులకు భంగం కలగకుండా పాలన సాగించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం బేషరతుగా బీసీలకు క్షమాపణ చెప్పాలని కె.కె.రాజు డిమాండ్ చేశారు.

హోం మంత్రి అనిత రాజీనామా చేయాలి

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ జిల్లా ప్రథమ మహిళకే రక్షణ కల్పించలేని దౌర్భాగ్య పాలన రాష్ట్రంలో సాగుతోందని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మహిళల అభివృద్ధి కోసం అన్ని రంగాల్లో 50 శాతం కేటాయిస్తే.. కూటమి ప్రభుత్వంలో మాత్రం మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహిళలకు భద్రత కల్పించలేని రాష్ట్ర హోం మంత్రి అనిత తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు బొల్లవరపు జాన్ వెస్లీ, బానాల శ్రీనివాసరావు, పల్లా చినతల్లి, అల్లంపల్లి రాజుబాబు, జహీర్ అహ్మద్, పి.సతీష్ వర్మ, నడింపల్లి కృష్ణరాజు, ద్రోణంరాజు శ్రీ వత్సవ, జోనల్, జిల్లా అనుబంధ అధ్యక్షులు అంబటి శైలేష్, ఉరుకూటి రామచంద్రరావు, సనపల రవీంద్ర భరత్, బోని శివ రామకృష్ణ, పులగం కొండా రెడ్డి, సేనాపతి అప్పారావు, పీలా ప్రేమ కిరణ్ జగదీష్, సకలా భక్తుల ప్రసాదరావు, రామిరెడ్డి, రాయపురెడ్డి అనిల్ కుమార్, ఎస్.లత, బొండా ఉమా మహేశ్వరరావు, నీలి రవి, దేవరకొండ మార్కండేయులు, కార్పొరేటర్లు అక్కరమాని పద్మ రామునాయుడు, దౌలపల్లి ఏడుకొండల రావు, కె.అనిల్ కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, బిపిన్ కుమార్ జైన్, కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, శశికళ, పి.వి.సురేష్, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గాల కమిటీ నాయకులు దొడ్డి కిరణ్, బెందాళం పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

భూమి విలువ రూ.12 కోట్లు
ఎమ్మెల్యే వాటా రూ.9 కోట్లు



రేవళ్లపాలెం భూకబ్జా వ్యవహారంలో కూటమి ఎమ్మెల్యేదే కీలకపాత్ర

ఎమ్మెల్యే సమక్షంలోనే డీల్.. రిజిస్ట్రేషన్ అయిన వెంటనే విక్రయం

1,206 గజాలు ఎమ్మెల్యేకు.. 366 గజాలు కబ్జారాయుళ్లకు..

ఓ స్థల యజమాని ఫిర్యాదుతో కదిలిన డొంక.. నిందితుల అరెస్టు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

కూటమి నేతల భూదాహం హద్దులు దాటుతోంది. మధురవాడ రేవళ్లపాలెం భూకబ్జా వ్యవహారంలో కూటమి ఎమ్మెల్యేదే కీలక పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. చనిపోయిన కుటుంబ సభ్యుల పేరుతో నకిలీ పత్రాలు సృష్టించడం .. వాటి ఆధారంగా జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ).. ఆ తర్వాత రిజిస్ట్రేషన్.. వెనువెంటనే విక్రయించడం చకాచకా సాగించిన ముఠా వెనుక అసలు సూత్రధారి సదరు ఎమ్మెల్యేనని స్పష్టమవుతోంది. ఉద్యోగాలు చేసుకుంటూ కొంచెం కొంచెం కూడబెట్టుకుని అన్ని అనుమతులు ఉన్న మధురవాడ సర్వే నెంబరు 203/14ఏ పార్టు బ్యాంక్ ఆఫీసర్స్ హౌసింగ్ లే అవుట్‌లో పలువురు స్థలాలు కొనుగోలు చేశారు. కొన్నాళ్లగా అక్కడకు రాకుండా ఉన్న వారితో పాటు చనిపోయిన వారి ప్లాట్ల వివరాలు తెలుసుకొని ఒక ముఠా నకిలీ అడంగల్, ఎఫ్ఎంబీలను సృష్టించింది. ఈ లే-అవుట్‌లో ఏకంగా 1,572.66 గజాల స్థలానికి ఈ విధంగా నకిలీ పత్రాలు సృష్టించి 2025 మే 28వ తేదీన జీపీఏ చేసుకోవడంతోపాటు 2025 మే 31వ తేదీన విక్రయించేసింది. ఈ పనులన్నీ చకాచకా సాగిపోవడం వెనుక కూటమి ఎమ్మెల్యే పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. సదరు ఎమ్మెల్యేకు 1,206 గజాలు, నకిలీ పత్రాలు సృష్టించిన వారికి 366.66 గజాలు చెందేటట్లుగా డీల్ కుదిరినట్లు సమాచారం. స్థల యజమాని ఫిర్యాదుతో నకిలీ పత్రాలు సృష్టించినవారు ఇటీవల అరెస్టు అయ్యారు. అసలు సూత్రధారి ఎమ్మెల్యే కావడంతో విచారణలో ముందుకెళ్లేందుకు పోలీసులు కూడా జంకుతున్నట్లు తెలుస్తోంది. తనకు సంబంధం లేని నియోజకవర్గంలో సదరు ఎమ్మెల్యే చక్రం తిప్పుతుండటంపై కూటమిలోని ఇతర ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

వ్యవహారం నడిచిందిలా...!

మధురవాడ రేవళ్లపాలెంలోని సర్వే నెంబరు 203/14ఏ పార్టు బ్యాంక్ ఆఫీసర్స్ హౌసింగ్ లే అవుట్ ఉంది. ఈ లే-అవుట్‌లో అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన ఆర్ఎస్ఎస్ ప్రకాశ్‌రావుతో పాటు మరికొందరు 300 గజాల చొప్పున ప్లాట్లను కొనుగోలు చేశారు. ఇందులో కొందరు మరణించగా మరికొందరు విదేశాల్లో స్థిరపడిపోయారు. దీనిని అదునుగా తీసుకుని రేవల్లపాలెంకు చెందిన బెవర అనిల్‌కుమార్, వెంకటేష్‌తో పాటు శ్రీకాకుళం జిల్లాకు చెందిన పగోటి దిలీప్‌కుమార్ తదితరులు తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించారు. తమ తాత, ముత్తాతల నుంచి వచ్చిన స్థలమంటూ తప్పుడు అడంగల్, ఎఫ్ఎంబీలను సృష్టించి పేర్లు చేర్చుకున్నారు. 1,572.66 గజాలకు జీపీఏ, ఆ తర్వాత రిజిస్ట్రేషన్ (దస్తావేజు నెంబరు 5585/2025) కూడా చేయించుకున్నారు. తన స్థలంలో ఎవరో దౌర్జన్యంగా పొక్లెయిన్లను ఉపయోగించి ఫెన్సింగ్ వేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ప్రకాశ్‌రావు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం బయటకు వచ్చింది. పోలీసులు విచారణ జరిపి భూఅక్రమార్కులను ఇటీవల అరెస్టు చేశారు. కాగా కాకినాడకు చెందిన ఉసిరికాల రాజారామ పద్మజ అనే మహిళ పేరిట స్థలం రిజిస్ట్రేషన్ జరిగింది. ఇందుకోసం ఆమె రూ.3.97 కోట్లు కూడా చెల్లించినట్టు రిజిస్ట్రేషన్ డాక్యుమెంటులో పేర్కొన్నారు.

బాగోతం వెనుక ఓ ఎమ్మెల్యే..!



ఆక్రమణ స్థలం చుట్టూ వేస్తున్న ఫెన్సింగ్

వాస్తవానికి తప్పుడు పత్రాలను సృష్టించడంతో పాటు రిజిస్ట్రేషన్ జరిగిన తర్వాత భూమిలో ఫెన్సింగ్ వేయడంలో అసలు సూత్రధారి కూటమి ఎమ్మెల్యేననే తెలుస్తోంది. పైకి అనిల్, వెంకటేష్, దిలీప్ కుమార్ కనిపిస్తున్నా వెనుక ఉండి నడిపించేదంతా ఆయననే సమాచారం. మొత్తం 1,572.66 గజాల స్థలంలో 1,206 గజాల స్థలం సదరు కూటమి ఎమ్మెల్యే ఖాతాలోకి చేరనున్నట్లు తెలుస్తోంది. మిగిలిన 366.66 గజాల స్థలం వీరికి చెందేలా సదరు ఎమ్మెల్యే వద్ద డీల్ కుదిరినట్టు సమాచారం. రిజిస్ట్రేషన్ శాఖ లెక్కల ప్రకారం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మధురవాడ ప్రాంతంలో గజం విలువ రూ.50 వేల మేర ఉంది. అంటే మొత్తం 1,572.66 గజాల విలువ రూ.7.86 కోట్లు అన్నమాట. ఇక మార్కెట్ విలువ ప్రకారం ఈ స్థలం ఖరీదు రూ.12 కోట్లకుపైగానే ఉంటుంది. ఇందులో సదరు ఎమ్మెల్యే ఖాతాలో ఉన్న 1,206 గజాల స్థలం విలువ రూ.9 కోట్ల పైమాటే. ఈ వ్యవహారంలో కూటమి పార్టీ ఎమ్మెల్యే ఉన్నాడని తెలియడంతో పోలీసులు విచారణలో లోతుగా వెళ్లడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నియోజకవర్గానికి సంబంధంలేని ఎమ్మెల్యే జోక్యం చేసుకుంటుండటంపై కూటమి పార్టీలో కూడా చర్చనీయాంశమైంది.

న్యూస్‌రీల్

ముగిసిన స్టీల్‌ప్లాంట్ వీఆర్ఎస్ గడువు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రకటించిన స్వచ్ఛంద పదవీ విరమణ(వీఆర్ఎస్) గడువు మంగళవారంతో ముగిసింది. సాయంత్రానికి సుమారు 1,200 మంది ఉద్యోగులు దరఖాస్తు చేశారు. కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ నిర్దేశించిన ఉద్యోగుల తగ్గింపు కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది మార్చిలో మొదటిసారి వీఆర్ఎస్ ప్రకటించారు. ఆ వీఆర్ఎస్‌లో 1,613 మంది దరఖాస్తు చేసుకోగా 1,126 మందివి ఆమోదించారు. రెండో విడత వీఆర్ఎస్‌లో భాగంగా గత నెల 15న దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించారు. ఈసారి గతం కంటే తక్కువగా దరఖాస్తులు అందాయి. రాత్రి 12 గంటల వరకు గడువు ఉండటంతో దరఖాస్తుల సంఖ్య మారే అవకాశం ఉంది. ఇందులో కొంత మంది విత్‌డ్రాకు దరఖాస్తు చేశారు. ఈ నెల 18న దరఖాస్తుల ఉపసంహరణ గడువుగా నిర్ణయించడంతో 19న తుది జాబితా వెల్లడించనున్నారు.

వైఎస్సార్ సీపీలో నియామకాలు

బీచ్‌రోడ్డు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా ములకలపల్లి పెంటారావు(విశాఖ పశ్చిమ), జాయింట్ కార్యదర్శిగా గంట సుందరరావు(విశాఖ పశ్చిమ) నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వైద్య ఆరోగ్యశాఖ డీడీగా సృజన

మహారాణిపేట: విశాఖలోని రీజనల్ మెడికల్ అండ్ హెల్త్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్(అడ్మిన్)గా ఎస్.సృజనను నియమించారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సృజన వైద్యారోగ్యశాఖ మంగళగిరిలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

ఉపాధ్యాయ అవార్డుల దరఖాస్తుకు రేపే ఆఖరు

ఆరిలోవ: ఉపాధ్యాయుల జాతీయ స్థాయి అవార్డులు-2025 కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 17 వరకు గడువు పొడిగించినట్లు డీఈవో ఎన్.ప్రేమకుమార్ తెలిపారు. గతంలో ప్రకటించిన విధంగా ఈ నెల 14తో దరఖాస్తు గడువు ముగిసినప్పటికీ, ఉపాధ్యాయుల విన్నపం మేరకు 17వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు తమ ప్రతిపాదనలను https:// nationalawardstoteachers.education.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను ఈ నెల 20లోగా అందజేయాలన్నారు.

వైద్యారోగ్య రంగ బలోపేతానికి చర్యలు

- మంత్రి సత్యకుమార్
- మెంటల్ కేర్ ఆసుపత్రిలో నూతన భవనాలు ప్రారంభం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, తదితరులు

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలో వైద్యారోగ్య రంగాన్ని బలోపేతం చేయడానికి వినూత్న చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. నిమ్స్ స్థాయికి విమ్స్‌ను తీర్చిదిద్దుతామని, ఇందుకు సంబంధించి కార్యాచరణను రూపొందిస్తున్నట్లు స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నుంచి సైకియాట్రీ విభాగంలో ఎమ్మెస్సీ లేదా డిప్లమో, క్లినికల్ సైకాలజీలో 30 సీట్లతో కూడిన ఎం.ఫిల్ కోర్సులను ప్రవేశపెడతామని మంత్రి వెల్లడించారు. మెంటల్ కేర్ ఆసుపత్రి ప్రాంగణంలో రూ. 29.70 కోట్లతో నిర్మించిన భవనాలను, పోలమాంబ గుడి సమీపంలోని భానోజీనగర్‌లో రూ.1.38కోట్లతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (యూపీహెచ్‌సీ)ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో 15 కోట్ల మంది మానసిక వ్యాధులతో బాధపడుతున్నారని, వారిలో 80 శాతం మందికి తమ రోగం గురించి తెలియదన్నారు. రాష్ట్రంలో మానసిక వైద్యులు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారని, ఈ లోటును అధిగమించేందుకు యువత మానసిక కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఇటీవల కోస్టల్ తీరంలో జరిపిన సర్వేల ప్రకారం 14.5 శాతం మంది బాలింతలు మానసిక సమస్యలతో బాధపడుతున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 19 శాతం, గిరిజన ప్రాంతాల్లో 21 శాతంగా ఉందన్నారు. 2020-21 గణాంకాల ప్రకారం, వివిధ కారణాలతో 8,062 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని, గత ఏడాది ఈ పరిస్థితి 48 శాతం పెరిగిందన్నారు. వారిలో 34 శాతం మంది దీర్ఘకాలిక వ్యాధుల వల్ల చనిపోతే, 7 శాతం కేవలం మానసిక సమస్యల వల్లే ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. మెంటల్ కేర్ ఆసుపత్రి పేరు మార్చాలని సూపరింటెండెంట్ డా. కె.వి.రామిరెడ్డి, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రతిపాదించగా.. పేరు మారిస్తే ఇబ్బందులు రావచ్చని, ఆలోచించి తగిన నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ మానసిక వైద్యంలో మరింత నాణ్యత పెరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ ఎవరికైనా మానసిక సమస్యలుంటే తగిన చికిత్స చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ మువ్వల లక్ష్మీసురేష్ పాల్గొన్నారు.

132 కేవీ భూగర్భ కేబుల్‌కు గ్రీన్ సిగ్నల్

విశాఖ సిటీ: విశాఖ వ్యాలీ జంక్షన్ నుంచి ఎండాడ పెట్రోల్ బంక్ వరకు అభయారణ్యం ప్రాంతంలో 132 కేవీ భూగర్భ ఎక్స్ఎల్‌పీఈ కేబుల్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జిఅనంతరాము మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. భారీ వర్షాలు, ఈదురుగాలులు, ఇతర విపత్తుల సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు గత కొన్నేళ్లుగా నగరంలో భూగర్భ కేబుల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అయితే విశాఖ వ్యాలీ నుంచి ఎండాడ పెట్రోల్ బంక్ మధ్య ప్రాంతం సీతకొండ అభయారణ్య ప్రాంతం అవడంతో కేంద్ర అటవీ శాఖ అనుమతులు తీసుకోవాల్సి వచ్చింది. ఈ భూగర్భ కేబుల్ ఏర్పాటుకు అన్ని అనుమతులు రావడంతో 0.46 హెక్టార్ల అటవీ భూమిలో 132 కేవీ అండర్‌గ్రౌండ్ ఎక్స్ఎల్‌పీఈ కేబుల్స్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కొన్ని షరతులతో కూడిన ఉత్తర్వులు జారీ చేసింది.

8 మంది ఎస్ఐలకు స్థానచలనం

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 8 మంది ఎస్ఐలకు స్థానచలనం కలిగింది. ఇందులో పదోన్నతిపై వచ్చిన ఐదుగురికి పోస్టింగ్ ఇచ్చారు. మిగిలిన ముగ్గురికి బదిలీ చేశారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో పదోన్నతిపై విశాఖకు వచ్చిన జి.విజయ్‌కుమార్‌ను సిటీ వీఆర్‌లో ఉంచుతూ పెందుర్తి లా అండ్ ఆర్డర్‌కు అటాచ్ చేశారు. అలాగే కాంతా సూర్యనారాయణను సీసీఆర్‌బీకి, ఎస్.లింగన్నదొరను స్టీల్‌ప్లాంట్ లా అండ్ ఆర్డర్‌తో పాటు దువ్వాడ ట్రాఫిక్‌కు అటాచ్ చేశారు. కలిశెట్టి సూర్యనారాయణను న్యూపోర్ట్ ట్రాఫిక్‌కు, కె.వి.కల్యాణరాజును పీసీఆర్‌లో పోస్టింగ్ కల్పించారు. న్యూపోర్ట్ ట్రాఫిక్‌లో ఉన్న జి.గణపతిరావును ఫోర్త్ టౌన్ లా అండ్ ఆర్డర్‌కు, ఫోర్త్‌టౌన్ క్రైమ్ ఎస్ఐ డి.రామమోహనరావును సిటీ వీఆర్‌లో ఉంచుతూ ట్రాఫిక్ యాక్సిడెంట్ విక్టిమ్ అసిస్టెన్స్ సెల్‌కు, అక్కడ ఉన్న ఎం.ప్రసాద్‌ను పీసీఆర్‌కు బదిలీ చేశారు.

మెడ్‌టెక్ జోన్‌లో మరో సంస్థ శంకుస్థాపన

విశాఖ సిటీ: ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో మరో సంస్థ ఆవిర్భావానికి అడుగులు వేస్తోంది. వైద్య పరికరాల తయారీలో ఉపయోగించే మెషీన్లను రూపొందించే వీవీడీఎస్ టెక్ సంస్థ ఏర్పాటుకు మంగళవారం శంకుస్థాపన జరిగింది. ప్రత్యేక వైద్య పరికరాలను తయారు చేసే మెషీన్లను పెద్ద సంఖ్యలో ఇక్కడ అభివృద్ధి చేయనుంది. ప్రధానంగా ఇంజక్షన్ మౌల్డింగ్ మెషీన్ల తయారీని చేపట్టనుంది. ఈ కార్యక్రమానికి మెడ్‌టెక్ జోన్ అధికారులతో పాటు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు రక్షణ శాఖ మంత్రి రాక

మహారాణిపేట: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ నెల 17, 18 తేదీల్లో విశాఖలో పర్యటించనున్నారు. విమానంలో 17వ తేదీ సాయంత్రం విశాఖ చేరుకొని రాత్రి బస చేస్తారు. 18న ఉదయం 10 గంటలకు నావల్ డాక్‌యార్డ్‌లో రక్షణ శాఖకు సంబంధించిన ఎన్‌ఐఎస్‌టీఏఆర్ షిప్‌ను ప్రారంభిస్తారు. అనంతరం ఢిల్లీకి బయలుదేరుతారు. రక్షణ మంత్రి పర్యటన నేపథ్యంలో నేవల్ అధికారులు, స్థానిక పోలీస్, ఫైర్, రెవెన్యూ, జీవీఎంసీ, ఫుడ్ సేఫ్టీ, మెడికల్ అధికారులు అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు.

పాలిటెక్నిక్ లేటరల్ ఎంట్రీకి దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన అనంతరం బ్రిడ్జి కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు పాలిటెక్నిక్ కాలేజీల్లో నేరుగా రెండో ఏడాదిలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రత్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు దరఖాస్తులను ఈనెల 18వ తేదీలోగా సమర్పించాలన్నారు. 19వ తేదీన ఉదయం 10 గంటలకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు. సీటు పొందిన విద్యార్థులు ప్రభుత్వ కాలేజీలకు రూ.6,000లు, ప్రైవేటు కాలేజీలకు రూ.26,000 తక్షణమే చెల్లించాల్సి ఉంటుందన్నారు.

నేటిలోగా బ్యాంకు ఖాతా ఓపెన్ చేసుకోండి

ఎంవీపీకాలనీ : తల్లికి వందనం పథకం నిధులు మంజూరైన నేపథ్యంలో అర్హులైన విద్యార్థులు బ్యాంకు ఖాతాలను ఓపెన్ చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె.రామారావు తెలిపారు. ఒకటో తరగతి విద్యార్థులకు వారి తల్లులు బ్యాంకు ఖాతా ఓపెన్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు వారి పేరు మీదే ఖాతాను తెరవాలన్నారు. ఓపెన్ చేసిన బ్యాంకు ఖాతాకు ఆధార్‌తోపాటు ఎన్‌పీసీఐ అనుసంధానం చేయించుకోవాలన్నారు.

విశాఖ చేరుకున్న ఇస్రో చైర్మన్

గోపాలపట్నం: ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ మంగళవారం సాయంత్రం విశాఖపట్నం చేరుకున్నారు. ఆయన హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో విశాఖ విమానాశ్రయానికి వచ్చారు. పలువురు శాస్త్రవేత్తలు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఇస్రో చైర్మన్ రోడ్డు మార్గంలో నోవాటెల్ హోటల్‌కు బయలుదేరి వెళ్లారు.

కూటమి నీ(చ)టి రాజకీయం

- రిక్షా కాలనీలో బోర్ పనులకు బ్రేక్
- పచ్చ నేతల తీరుపై ప్రజల ఆగ్రహం
- ఖాళీ బిందెలతో కాలనీలో నిరసన



టెంట్‌లోనే నిద్రించి నిరసన తెలుపుతున్న మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



ఖాళీ బిందెలతో రోడ్డుపై ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

విశాఖ విద్య: కూటమి నేతల కుళ్లు రాజకీయాలకు ప్రజలు బలైపోతున్నారు. ప్రజలు దాహంతో అల్లాడుతున్నా.. పెత్తనం కోసం ఆరాటపడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. వార్డులో ప్రజల మద్దతుతో గెలిచిన కార్పొరేటర్‌ను కాదని.. జీవీఎంసీ నిధులతో చేపట్టే పనులకు కూటమి పార్టీలకు చెందిన చోటామోటా నాయకులే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. తమను కాదని.. ముందుకు వెళ్లడానికి వీల్లేదని అధికారులకు సైతం హుకుం జారీ చేస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని 52వ వార్డు గౌరీనగర్ (రిక్షా కాలనీ)లో మంగళవారం చోటుచేసుకున్న పరిణామాలు పచ్చ నేతల ఆగడాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచాయి.

బోరు పనులకు అడ్డుకట్ట

జీవీఎంసీ 52వ వార్డు పరిధి రిక్షా కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక చొరవ తీసుకొని బోరువెల్ నిర్మాణానికి జీవీఎంసీ ద్వారా నిధులు మంజూరు చేయించారు. రిక్షా కాలనీలో సుమారు 120 గడపలు ఉండగా, ఇక్కడ 500 మందికి పైగా నివసిస్తున్నారు. వీరంతా రోజువారీ కూలి పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సరిపడా తాగునీరు లేక, సమీపంలో ఉన్న రైలు పట్టాలు దాటుకొని.. అవతలి కాలనీలకు వెళ్లి ప్రతిరోజూ నీళ్లు తెచ్చుకుంటున్నారు. కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ఈ ఇబ్బందులను తొలగించేలా మూడు బ్లాక్‌లకు మూడు బోర్లు వేసేలా జియ్యాని శ్రీధర్ నిధులు మంజూరు చేయించారు. సోమవారం ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. ఒక బ్లాక్‌లో బోరువెల్ వేశారు. మంగళవారం మిగతా రెండు బ్లాక్‌ల్లో బోరువెల్ నిర్మాణం పూర్తవుతుందని అంతా సంబరపడ్డారు. కానీ తమ ప్రమేయం లేకుండా పనులు జరిగిపోతున్నాయనే అక్కసుతో కూటమి వార్డు నాయకుడొకరు వాటర్‌వర్క్స్ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి, పనులు నిలిపి వేయించారు.

పెల్లుబికిన నిరసన

బోరువెల్ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిపివేయడంపై రిక్షా కాలనీ వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పైపులు తీసుకొచ్చిన కాంట్రాక్టర్ డ్రిల్లింగ్‌కు అంతా సిద్ధం చేసినా, పనులు జరగకుండా కూటమి నాయకులు అడ్డుపడుతున్నారని తెలుసుకున్న కాలనీ వాసులు నిరసనకు దిగారు. ఖాళీ బిందెలతో వాహనానికి అడ్డంగా, రోడ్డుపైనే ఆందోళన చేపట్టారు. మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కాలనీలో జరిగిన పరిణామాలపై జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించేందుకు ఏ ఒక్క అధికారి కూడా అక్కడికి రాకపోవడంతో కాలనీ వాసులంతా రాత్రి వరకు రోడ్డుపైనే ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. 'మాకు బోరు వేయాలి.. తాగునీళ్లు ఇప్పించాలి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

అధికారులు మౌనం ఎందుకో?

రిక్షా కాలనీలో బోర్‌వెల్ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని తెలిసినా, జీవీఎంసీ వాటర్‌వర్క్స్ విభాగం అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. జీవీఎంసీ నిధులతో, పద్ధతి ప్రకారం టెండర్ ద్వారా కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించినప్పుడు, వీటిని దగ్గరుండి పూర్తి చేయాల్సిన అధికారులు ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనిపై వాటర్ వర్క్స్ విభాగం ఏఈ సుమన్‌ను 'సాక్షి' వివరణ కోరేందుకు పలుమార్లు ప్రయత్నించినా, ఆయన ఫోన్‌కు స్పందించలేదు.

ప్రజలతో ఆటలాడుకోవడం సరికాదు

రిక్షాకాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి జీవీఎంసీ ద్వారా నిధులు మంజూరు చేయించాం. స్థానిక కార్పొరేటర్‌గా ఆ పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. ఇలాంటి విషయాల్లో కూడా రాజకీయాలు చేయడం సరైంది కాదు. ప్రజలతో ఆటలాడుకోవడం మంచి పద్ధతి కాదు. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకుని, బోర్ వెల్ నిర్మాణం పూర్తి చేయాలి. రిక్షా కాలనీ వాసులకు తాగునీటిని అందించాలి.

– జియ్యాని శ్రీధర్, మాజీ డిప్యూటీ మేయర్

ఎస్‌హెచ్‌జీలకు రూ.264.58 కోట్ల రుణ ప్రణాళిక



డీఆర్‌డీఏపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలోని 4,872 స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థిక అవసరాలను తీర్చడం, జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.264.58 కోట్ల ఆర్థిక ప్రణాళికను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) రూపొందించింది. మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జరిగిన స్వయం సహాయక సంఘాల జీవనోపాధి వార్షిక రుణ ప్రణాళికలపై కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. ఈ ప్రణాళిక ద్వారా మొత్తం 5095 సూక్ష్మ ఆర్థిక ప్రణాళికలు రూపుదిద్దుకోనున్నాయి. రూ.264.58 కోట్ల నిధుల్లో బ్యాంక్ లింకేజ్ ద్వారా రూ.198.24 కోట్లు, ఇతర వనరుల ద్వారా రూ.66.34 కోట్లు సమకూర్చనున్నారు. అలాగే 17,128 మంది సభ్యులకు రూ.158.34 కోట్ల వ్యవసాయ ఆధారిత రుణాలు, 8,192 మంది సభ్యులకు రూ.82.57 కోట్ల వ్యవసాయేతర రుణాలు, 4,337 మంది సభ్యులకు ఇతర అవసరాలకు రూ.27.07 కోట్లతో రుణ ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ రుణ ప్రణాళికల అమలు తీరుతెన్నులపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. సమీక్షలో డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతితో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఏయూలో జాబ్ మేళా

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరోలో బుధవారం ఉదయం 10.30 నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఏయూ యూఈఐ అండ్ జీబీ డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు తెలిపారు. ఇందులో వీల్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ మెకానిక్, ఈఈఈ, ఈసీఈ(2023–2025 బ్యాచ్) విద్యార్హతలు ఉన్న వారిని ట్రైనీ గ్రాడ్యుయేట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందని వెల్లడించారు. అలాగే ఐటీఐలో వెల్డర్, టర్నర్, మెషినిస్ట్‌లను, క్వాలిటీ విత్ ఎన్‌డీటీ లెవెల్–1, 2 పోస్టులకు డిప్లమో అభ్యర్థులను తీసుకోనున్నట్లు వివరించారు. హెచ్‌డీఎఫ్‌సీ ఫైనాన్షియల్ కన్సల్టెంట్ కెరీర్ ప్రోగ్రాం కింద 10వ తరగతి నుంచి ఎంబీఏ అభ్యర్థులను, యాక్సిస్ బ్యాంక్–క్వెస్ కార్ప్ లిమిటెడ్ సంస్థ డిగ్రీ, ఆపై అర్హతలు ఉన్న వారిని రిలేషన్‌షిప్ ఆఫీసర్, సీనియర్ రిలేషన్‌షిప్ ఆఫీసర్, టీమ్ లీడర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని తెలిపారు. అభ్యర్థులు ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరోలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జరిగే జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు తమ వివరాలను https://employment.ap.gov.in, https://www.ncs.gov.in లో పొందుపర్చాలని సూచించారు.

జిల్లా కోర్టులో వన్ కే వాక్ నేడు

విశాఖ లీగల్ : మధ్యవర్తిత్వం జాతి శ్రేయస్సు అన్న నినాదంతో బుధవారం ఉదయం వన్ కే వాక్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజు తెలిపారు. వివిధ న్యాయస్థానాల్లో పేరుకుపోతున్న కేసులను సత్వరం పరిష్కరించే దిశగా మధ్యవర్తిత్వ విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, మధ్యవర్త్యత్వ శిక్షకులు, సమాంతర న్యాయ సేవ సహాయకులు, సమాంతరంగా సేవా సంస్థ సిబ్బంది, విశాఖ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థిని బలవన్మరణం

గోపాలపట్నం : తండ్రికి ఆర్థిక భారం కాకూడదని విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మంగళవారం ఇందిరానగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 92వ వార్డు ఇందిరానగర్‌లో వానపల్లి శృతికీర్తన(18) కుటుంబ సభ్యులతో నివాసముంటుంది. తండ్రి సన్యాసిరావు మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. శృతికీర్తన డిప్లమో పూర్తి చేసింది. ఇంజినీరింగ్ సెకండియర్‌లో చేరేందుకు ఈసెట్ రాయగా 300 ర్యాంకు వచ్చింది. కౌన్సెలింగ్‌లో ప్రభుత్వ కళాశాలలో సీటు రాకపోవడంతో మనస్తాపానికి గురైంది. ప్రైవేటు కళాశాలలో చేరేందుకు డబ్బులు అవసరమవుతాయని విద్యార్థిని తండ్రి రూ.5 లక్షలు అప్పు చేశాడు. తన వల్లే తండ్రి అప్పుల పాలవుతున్నాడని భావించిందేమో కుటుంబ సభ్యులు మొబైల్ షాపులో ఉండగా ఇంట్లో ఒంటరిగా ఉన్న శృతి ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. రాత్రి 7.30 గంటలకు ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు తలుపు కొట్టినా తీయకపోవడంతో.. పగలుగొట్టి చూడగా ఉరివేసుకుని కనిపించింది. పోలీసులకు సమాచారమివ్వడంతో ఎస్ఐ రామారావు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఎంత కష్టమయినా చదివిస్తానని ఒప్పించినా భారంగా ఉండకూడదనుకుందంటూ కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. తండ్రి సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

'రాష్ట్రంలో 12వ పే కమిషన్ ప్రకటించండి'

మహారాణిపేట: రాష్ట్రంలో 12వ పే కమిషన్‌ను వెంటనే నియమించాలని, తక్షణం మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డీడీ ప్రసాదరావు డిమాండ్ చేశారు. అఖిల భారత స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ పిలుపుపై రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న జిల్లా పెన్షనర్స్ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పెండింగ్ డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పెన్షన్ వేలిడేషన్ సవరణ బిల్లుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు నష్టం వాటిల్లుతుందన్నారు. దీన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రిటైర్డు ఎస్‌టీవో జె.సత్యారావు, అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టీవీ రమణమూర్తి, ఉపాధ్యక్షుడు అప్పలనాయుడు, పైలా రామలింగేశ్వరరావు, కోశాధికారి టి.గోపాలకృష్ణ, జాయింట్ సెక్రటరీ(ఉమెన్స్ వింగ్) బి.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం తమ డిమాండ్లపై జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

బీర్ బాటిళ్లతో వ్యక్తిపై దాడి

- అర్ధరాత్రి మద్యం మత్తులో యువకుల హల్‌చల్
- 11మంది అరెస్ట్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జీవన్

గాజువాక: మద్యం మత్తులో ఇంటి ముందు గొడవ చేస్తున్న యువకులను వారించిన వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన సంఘటన గాజువాక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. గాయపర్చిన నలుగురితోపాటు మరో ఏడుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివి.. బీసీ రోడ్‌లో నివాసమంటున్న జీవన్‌కుమార్ తన ఇంటి ముందు నిలిపి ఉంచిన కారు వద్ద సోమవారం అర్ధరాత్రి కొంతమంది యువకులు మద్యం మత్తులో గొడవ చేస్తున్నారు. ఇది గమనించిన జీవన్‌కుమార్ వారిని వారించే ప్రయత్నం చేయగా.. గాజువాక ప్రాంతానికి చెందిన దనాల అప్పలరాజు, మజ్జి వెంకటరమణ, షేక్ బషీర్, మోహన్ కార్తీక్‌లు బీర్ బాటిళ్లతో జీవన్‌కుమార్‌పై దాడి చేసి గాయపర్చారు. అక్కడే ఉన్న మరో ఏడుగురు జీవన్ కుమార్‌ను కిందికి లాక్కొని రావాలని, చంపేస్తామని గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకున్నారు. దీంతో 11 మంది యువకులు పరారయ్యారు. జీవన్‌కుమార్ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. 11 మందిని పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. వీరిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని పోలీసులు వెల్లడించారు.

సీనియర్ల సారథ్యం.. యువోత్సాహం

- వచ్చే నెల 8 నుంచి ఏపీఎల్ హోరు
- అందరి చూపు విశాఖ క్రికెటర్ల వైపే..



విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్(ఏపీఎల్)లో ఆటగాళ్ల వేలం ముగిసింది. నాలుగో సీజన్ కాస్త ఆలస్యమైనా.. ఆగస్టు 8 నుంచి 23 వరకు అట్టహాసంగా జరగనుంది. అన్ని మ్యాచ్‌లకు నగరంలోని వైఎస్ రాజశేఖర రెడ్డి స్టేడియం వేదిక కానుంది. ఈ టోర్నీలో మొత్తం 25 మ్యాచ్‌లు (4 ప్లేఆఫ్‌లతో కలిపి) జరగనున్నాయి. ఏపీఎల్ కేవలం అభిమానులను ఉత్సాహపరచడమే కాకుండా.. ఎందరో యువ ఆటగాళ్లకు ఐపీఎల్ లాంటి మెగా టోర్నీల్లో తలుపు తట్టే సువర్ణావకాశం కల్పించనుంది. వేలానికి ముందే ఏడు ఫ్రాంచైజీలు తమ కెప్టెన్లను ఎంచుకోగా.. మిగిలిన ఆటగాళ్ల కోసం వేలం జరిగింది. మొత్తం 520 మంది ఆటగాళ్లలో 135 మందిని ఫ్రాంచైజీలు దక్కించుకున్నాయి.

విశాఖ ఆటగాళ్ల హవా..

ఈ సీజన్‌లో జట్లకు నాయకత్వం వహించనున్న వారిలో విశాఖ ఆటగాళ్ల హవా కనిపిస్తోంది. సింహాద్రి వైజాగ్ లయన్స్‌కు రిటైన్ చేసుకున్న ఆటగాళ్లలో అత్యధిక ధర పలికిన రికీ భుయ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. భీమవరం బుల్స్‌ను నితీష్ కుమార్ రెడ్డి, అందుబాటులో లేకపోతే సత్యనారాయణ రాజు నడిపిస్తాడు. కాకినాడ కింగ్స్‌కు డిఫెండింగ్ కెప్టెన్, వికెట్ కీపర్ శ్రీకర్ భరత్ తన బాధ్యతలను కొనసాగించనున్నాడు. రాయల్స్ రాయలసీమ విశాఖకే చెందిన అవినాష్‌ను వేలంలో అత్యధిక ధరకు దక్కించుకుంది. అయితే కెప్టెన్సీని రిటైన్ చేసుకున్న రషీద్‌కు ఇస్తారా లేక అవినాష్‌కు అప్పగిస్తారా అనేది తేలాల్సి ఉంది. స్టార్ బ్యాటర్ హనుమ విహారి తిరిగి ఏపీఎల్‌లోకి వచ్చాడు. అమరావతి రాయల్స్ జట్టును నడిపించనున్నాడు. విజయవాడ సన్‌షైనర్స్‌కు గత సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన అశ్విన్ హెబ్బర్ నాయకత్వం వహించనున్నాడు. తుంగభద్ర వారియర్స్ కెప్టెన్సీ విశాఖకే చెందిన శశికాంత్ లేదా స్టీఫెన్లలో ఒకరికి దక్కే అవకాశం ఉంది.

యువతపైనే అందరి దృష్టి

ఈసారి ఏపీఎల్‌లో యువ ఆటగాళ్లపై ప్రత్యేక దృష్టి నెలకొంది. ప్రతి జట్టులో ఇద్దరు అండర్–19 ఆటగాళ్లు ఉండాలనే నిబంధనతో ఫ్రాంచైజీలు యువ ప్రతిభకు పట్టం కట్టాయి. వారియర్స్ జట్టు ఏకంగా ఆరుగురు అండర్–19 ఆటగాళ్లను కొనుగోలు చేసి పెద్ద ప్రయోగానికే సిద్ధమైంది. బీ గ్రేడ్‌లో బేస్ ప్రైజ్ రూ.60 వేలు, సీ గ్రేడ్‌లో రూ.30వేలుగా నిర్ణయించగా.. వేలంలో కొందరు యువ ఆల్‌రౌండర్లు ఊహించని ధర పలికారు. వీరారెడ్డి (అనంతపురం)ని లయన్స్ జట్టు ఏకంగా రూ. 4.20 లక్షలకు కొనుగోలు చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇటీవల అంతర్ జిల్లాల టోర్నీలో వీరారెడ్డి 86.80 స్ట్రయిక్‌రేట్‌తో 592 పరుగులు చేశాడు. 3.56 ఎకానమీతో 10 వికెట్లు, 8 స్టంపింగ్‌లతో అద్భుత ప్రదర్శన చేశాడు. అర్జిత్ (కడప)ను వారియర్స్ జట్టు రూ. లక్షకు దక్కించుకుంది. అర్జిత్ 332 పరుగులు, 14 వికెట్లతో సత్తా చాటాడు. జయచంద్ర కేశవ్ (గుంటూరు)ను కూడా వారియర్స్ జట్టే రూ. 90 వేలకు కొనుగోలు చేసింది. కేశవ్ 158.43 స్ట్రైక్ రేట్‌తో 282 పరుగులు చేసి తన దూకుడును ప్రదర్శించాడు. వీరే కాక ప్రద్యుష్, బస్వాంత్, విష్ణుదత్త, భార్గవ్, నాగవినయ్, ధీరజ్, మనోజ్, దుర్గేశ్, రామ్‌కుమార్, ఈశ్వర్, హర్షసాయి, ఆనంద్, ఆకాష్, శ్రీదత్త, తోషిత్ వంటి ఎందరో అండర్–19 ఆటగాళ్లు జట్లకు ఎంపికయ్యారు. అయితే వీరిలో తుది జట్టులో ఎంతమందికి అవకాశం దొరుకుతుందో చూడాలి. అయితే అంతర్ జిల్లాల టోర్నీలో అద్భుతంగా రాణించిన వరుణ్ సాయి (26 వికెట్లు), ప్రణీత్, మన్విత్ (500కి పైగా పరుగులు) వంటి ఆటగాళ్లను ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయకపోవడం గమనార్హం. మొత్తం మీద జట్ల ఎంపిక పూర్తి కావడంతో ఇప్పుడు అందరి దృష్టి టైటిల్‌పైనే ఉంది. అనుభవజ్ఞులైన కెప్టెన్లు, ఉత్సాహవంతులైన యువ ఆటగాళ్లతో ఈ నాలుగో సీజన్ ఎలాంటి సంచలనాలకు వేదిక అవుతుందో వేచి చూడాలి.

సాగర తీరంలో కాలుష్య నియంత్రణకు కార్యాచరణ

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశం

డాబాగార్డెన్స్: విశాఖ సాగర తీరంలోకి వ్యర్థాలు, మురుగునీరు చేరకుండా నిరోధించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, పర్యవేక్షక ఇంజినీర్ పీవీవీ సత్యనారాయణరాజుతో కలిసి మంగళవారం ఆర్కే బీచ్ నుంచి సబ్‌మెరైన్ వరకు తీర ప్రాంతాన్ని పరిశీలించారు. ముఖ్యంగా ఆర్.కె.బీచ్, పాండురంగాపురం, వైఎంసీఏ సమీపంలో కాలుష్య నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వర్షపు నీటితో పాటు వ్యర్థాలు సముద్రంలో కలవకుండా బీచ్ ఒడ్డున ఒక ప్రత్యేక చానల్ నిర్మించాలని, పాండురంగాపురం వద్ద పని చేయని మురుగునీటి పంప్ హౌస్‌ను వెంటనే మరమ్మతు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కాలువల ద్వారా వ్యర్థాలు బీచ్‌లో చేరకుండా ప్రస్తుతం ఉన్న మెష్‌లను మార్చి, పటిష్టమైనవి ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్య పనులపై అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్.. మినీ స్వీపింగ్ యంత్రాల పనితీరును మెరుగుపరచాలని జెడ్సీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోవిందరావును ఆదేశించారు. పాండురంగాపురం బీచ్ సమీపంలో ఉన్న అరకు కాఫీ నిర్వాహకులతో మాట్లాడుతూ డస్ట్‌బిన్‌లు ఉన్నప్పటికీ వ్యర్థాలు ఎందుకు ఎక్కువగా ఉన్నాయని ప్రశ్నించారు. బీచ్‌లోని దుకాణాల నిర్వాహకులే తమ వ్యర్థాలను తొలగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలని, వారికి అవగాహన కల్పించాలని అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ బి.ప్రసాదరావుకు సూచించారు. కార్యనిర్వాహక ఇంజినీర్ గంగాధర్, ఏసీపీ మధుసూదన రావు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ అన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల పనితీరుపై నిశిత పరిశీలన

పారిశుధ్య కార్మికుల పనితీరును నిశితంగా పరిశీలించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ఏఎంవోహెచ్‌లు, ఇతర ప్రజారోగ్య, మెకానికల్, తాగునీరు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజారోగ్య విభాగాధికారులు రోజూ ఉదయం క్షేత్ర స్థాయిలో పారిశుధ్య కార్మికుల పనితీరు పరిశీలించాలని సూచించారు. ప్రజారోగ్య విభాగ అధికారులు వారంలో ఒకరోజు పారిశుధ్య కార్మికులతో చర్చించడం ద్వారా లోపాలు సరిదిద్దవచ్చన్నారు. నగరంలో దోమలు వృద్ధి చెందకుండా అవగాహన కార్యక్రమాలు సరిగ్గా నిర్వహించడం లేదని జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి పైప్‌లైన్లలో లీకులు లేకుండా అరికట్టాలని, ప్రతిరోజూ నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాకే ప్రజలకు అందించాలని ఆ విభాగాధికారులను ఆదేశించారు. జీవీఎంసీలో మెరుగైన సేవలు అందించే వారికి త్వరలో ప్రభుత్వం అందించే ర్యాంకులు, అవార్డులు వార్డు, జోనల్ స్థాయిలో ప్రకటించి, అందిస్తామన్నారు.

పోక్సో కేసులో యువకుడికి మూడేళ్ల జైలు

విశాఖ లీగల్: బాలికపై లైంగికదాడికి యత్నించిన యువకుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి పి.మంగాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు రూ.1000 జరిమానా చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో స్పష్టం చేశారు. బాధితురాలికి రూ.25 వేలు పరిహారం చెల్లించాలని కూడా న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తిన రాజశేఖర్ అందించిన వివరాలివి. నిందితుడు బొడ్డపాటి ఆనంద్‌కుమార్ (20) పాయకరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరాంపురం నివాసి. పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవించేవాడు. బాధితురాలు నిందితుడి ఇంటికి సమీపంలో ఉండేది. ఉన్నత పాఠశాలలో చదువుకునేది. 2022 జూన్ 18వ తేదీ అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఆనంద్‌కుమార్ బాలిక ఇంటికి వెళ్లి ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో పక్కనే ఉన్న తల్లిదండ్రులు నిందితుడిని పట్టుకున్నారు. దీనిపై పాయకరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద అప్పటి పోలీస్ అధికారి జి.శిరీష నిందితుడిపై కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు.

ట్రాఫిక్ నిర్వహణకు 'ప్రాజెక్ట్ సారథి'

పైలట్ ప్రాజెక్టుగా అమలు
జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత సమగ్ర ట్రాఫిక్ నిర్వహణకు 'ప్రాజెక్టు సారథి'పేరిట పైలట్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ ట్రాఫిక్ పోలీస్ విభాగంతో సమన్వయం చేస్తూ పనిచేస్తుందన్నారు. 5 కంపెనీల భాగస్వామ్యంతో నగరంలోని 10 ప్రాంతాల్లో వాహన నంబర్ ప్లేట్ల గుర్తింపు, రెడ్‌లైట్ ఉల్లంఘన గుర్తింపు, ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ అమలు చేస్తున్నామన్నారు. నెలపాటు పైలట్ ప్రాజెక్టు కొనసాగుతుందని, అత్యుత్తమ ఫలితాలిచ్చే మోడల్‌ను ఎంపిక చేసి త్వరలో నగరమంతా విస్తరిస్తామన్నారు.

అమలు చేస్తున్న ప్రాంతాలు

సంస్థ పేరు	కేటాయించిన జంక్షన్లు
బృహస్పతి టెక్నాలజీ	అక్కయ్యపాలెం జంక్షన్, సంపత్ వినాయక టెంపుల్
మెటా ఫ్యూజన్ టెక్నాలజీస్	ఊర్వశి జంక్షన్, ద్వారకా బస్‌స్టేషన్
డేటా కార్ప్	ఆర్ అండ్ బీ జంక్షన్, పాస్‌పోర్ట్ ఆఫీస్
ఎన్ఐసీ(నోయిడా)	గోపాలపట్నం పెట్రోల్ బంక్ జంక్షన్, సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్
సీఎంఎస్ కంప్యూటర్స్	ఎండాడ జంక్షన్, విమ్స్ హాస్పిటల్

రెండు నర్సింగ్ కాలేజీల గుర్తింపు రద్దు

మహారాణిపేట: విశాఖలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెండు నర్సింగ్ కాలేజీల అనుమతులను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సబ్బవరం మండలం కిల్లివానిపాలెంలో నైటింగేల్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, అదే గ్రామంలో ఫ్లోరెన్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లకు గతంలో ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. అయితే నిబంధనలకు విరుద్ధంగా ఈ నర్సింగ్ కాలేజీలను నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. దీనిపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ విచారణ చేపట్టింది. ఇందులో రెండు కాలేజీల యాజమాన్యం ఒక్కరే ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఫ్లోరెన్స్ కాలేజ్ అడ్రస్‌లో విద్యార్థులు లేనట్లు నిర్ధారణకు వచ్చారు. రెండు కాలేజీల పేరుతో అడ్మిషన్లు నిర్వహించి నైటింగేల్ కాలేజ్‌లోనే అందరికీ తరగతులు బోధిస్తున్నట్లు తెలుసుకున్నారు. అలాగే ఈ కాలేజీలు అనుబంధ ఆస్పత్రులు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. ఆ ఆస్పత్రులు కూడా లేకుండా కాలేజీలు నిర్వహిస్తున్నట్లు గుర్తించడంతో ఆ నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. దీంతో ప్రభుత్వం ఆ రెండు కాలేజీల అనుమతులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.